సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



జిల్లా కేంద్రంలో హనుమాన్ విగ్రహంతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



దోమకొండలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కామారెడ్డి వివేకానంద కాలనీలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు.



నాగిరెడ్డిపేట: గోపాల్‌పేటలో ర్యాలీలో పాల్గొన్న భక్తులు

వీర హనుమాన్.. విజయ యాత్ర

జిల్లాలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయమే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాలలో పాల్గొన్నారు. పలు ప్రాంతాలలో వీర హనుమాన్ విజయ యాత్రలు నిర్వహించారు. శోభాయాత్రలలో వేలాదిమంది పాల్గొన్నారు. కామారెడ్డిలో కోదూరి హనుమాన్ మందిరం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర పుర వీధుల గుండా కనుల పండువగా సాగింది. భారీ హనుమాన్, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలతో ర్యాలీలు తీశారు. జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి.

– సాక్షి, నెట్‌వర్క్

న్యూస్‌రీల్

'పట్టు పరిశ్రమతో మంచి ఆదాయం'



బీబీపేట : పట్టు పరిశ్రమతో రైతులు మంచి ఆదాయం పొందవచ్చని జిల్లా పట్టుపరిశ్రమ అధికారి అయిలయ్య పేర్కొన్నారు. శనివారం యాడారంలోని రైతు వేదికలో పట్టు పరిశ్రమపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తూ పట్టు పరిశ్రమను ప్రోత్సహిస్తోందన్నారు. తక్కువ శ్రమతో అతి తక్కువ రోజుల్లో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని పేర్కొన్నారు. మల్బరీ సాగువైపు దృష్టి సారించాలని రైతులకు సూచించారు.

15న జిల్లాకు మంత్రి జూపల్లి రాక

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈనెల 15 న జిల్లాకు రానున్నారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు కామారెడ్డి కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో ఆయన పాల్గొంటారు. వ్యవసాయ, సివిల్ సప్లయ్, మార్కెటింగ్, వైద్య ఆరోగ్య, నీటి పారుదల తదితర శాఖలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షిస్తారని అధికారులు తెలిపారు. అనంతరం ఆర్మూర్‌కు బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



ఎల్లారెడ్డి : ఎస్పీ రాజేశ్ చంద్ర శనివారం ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సైలు పూల మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవవందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో ప్రవర్తించాల్సిన తీరును సిబ్బందికి వివరించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు పెట్రోలింగ్, గస్తీ నిర్వహించాలని, అనుమానితులను పరిశీలించాలని ఆదేశించారు. పట్టణంలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఫరీదుపేట వాసి ఎంపిక



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేటకు చెందిన సునీల్‌రెడ్డి అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో 5 కిలోమీటర్ల పరుగు పందెంలో సునీల్‌రెడ్డి సిల్వర్ మెడల్ సాధించారన్నారు. దీంతో ఆయనను అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. త్వరలో శ్రీలంకలో నిర్వహించే అంతర్జాతీయ పోటీలలో ఆయన పాల్గొంటారని తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్ మోహన్, ప్రధాన కార్యదర్శి నరేశ్ అభినందించారు.

డిగ్రీ ప్రాక్టికల్స్ బహిష్కరిస్తాం

- ప్రైవేట్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 16 నుంచి జరిగే డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల విషయమై ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న జాప్యంతో ప్రైవేట్ కళాశాలల భవనాల అద్దెలు చెల్లించలేక, లెక్చరర్ల జీతభత్యాలు ఇవ్వలేక యాజమాన్యాల బతుకులు అగమ్యగోచరంగా మారాయన్నారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ డిగ్రీ ప్రాక్టికల్స్ బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు తెయూ రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారికి లేఖ అందజేసినట్లు పేర్కొన్నారు.

మట్టిని తెచ్చి.. పాత్రగ మలచి...



- మట్టి పాత్రల తయారీకి జుక్కల్ ప్రాంతం ప్రసిద్ధి
- రంజన్లు, కుండలు, వంట పాత్రల తయారీతో ఉపాధి

విష్ణుమూర్తి సుదర్శన చక్రం తిప్పినట్లుగా కుమ్మరి సారెను గిర్రున తిప్పేస్తారు. బ్రహ్మదేవుడు సృష్టికి ప్రాణం పోసినట్లుగా.. మట్టిముద్దల్ని అలవోకగా కుండలుగా మలిచేస్తారు. చూడచక్కని ఆకృతులలో పాత్రలు తయారు చేస్తారు. మట్టితో కుండలు, పూలతొట్లు, వంట పాత్రలు, దీపెంతలు.. ఇలా రకరకాల వస్తువులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు కుమ్మరులు. కష్టానికి తగిన ఫలితం లభించనప్పటికీ తరతరాలుగా వస్తున్న కుల వృత్తిని కొనసాగిస్తూ వస్తున్నారు.



పాత్రల తయారీ కోసం మట్టిలోంచి చెత్తను తొలగించి ఆరబెడుతున్న మహిళ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో మట్టి పాత్రల తయారీకి జుక్కల్ ప్రాంతం పెట్టింది పేరు. మూడు రాష్ట్రాల కూడలి, మూడు భాషలు మాట్లాడే ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, పిట్లం తదితర మండలాల్లో కుమ్మరులు ఇప్పటికీ మట్టి కుండలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. కొందరు కామారెడ్డికి వలస వెళ్లి కుండలు తయారు చేస్తుండగా, చాలా మంది సొంతూళ్లలోనే ఉంటూ మట్టితో కుండలు, పూలతొట్లు, వంట పాత్రలు, దీపెంతలు తదితర వస్తువులు తయారు చేస్తున్నారు.

వివిధ ప్రాంతాలకు సరఫరా...

జుక్కల్ నియోజకవర్గంలో తయారైన మట్టి పాత్రలు వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. కామారెడ్డి జిల్లాతోపాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, సంగారెడ్డి నగరాలు,



మట్టి పాత్రలు తయారు చేస్తున్న కుమ్మరి

పొరుగు రాష్ట్రాలలోని నాందేడ్, బీదర్ ప్రాంతాలకూ పంపిస్తున్నారు. రాష్ట్రంలోని చాలా చోట్ల జుక్కల్ ప్రాతానికి చెందిన కుమ్మరులు తయారు చేసిన కుండలు, రంజన్లు, వంట పాత్రలు అమ్ముతారు. మంచి కళానైపుణ్యం ఉండడంతో ఆధునిక డిజైన్లలోనూ చాలా వస్తువులు తయారు చేస్తున్నారు. కొందరు ముందుగా ఆర్డర్ ఇస్తారని, దానికి అనుగుణంగా తయారు చేస్తామని కుమ్మరులు చెబుతున్నారు.



మద్నూర్ మార్కెట్‌లో మట్టి పాత్రలు విక్రయిస్తున్న మహిళ

ప్రోత్సాహం కరువు

మట్టి పాత్రల తయారీకి అవసరమైన మట్టి చెరువుల్లో కుమ్మరులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి తీసుకురావడం వల్ల భారం పడుతోందని వారంటున్నారు. తమ కుల వృత్తికి సంబంధించిన ఆధునిక పరికరాలు ఎన్నో వచ్చినా వాటిని కొనుగోలు చేసే ఆర్థిక శక్తి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకుని, సబ్సిడీపై ఆయా పరికరాలను అందించాలని కోరుతున్నారు.

సీజన్‌లోనే పని..



ఎండాకాలంలో రంజన్ల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. ముందుగా ఆర్డర్ ఇచ్చిన వారికి తయారు చేసి ఇస్తాం. పెళ్లిళ్ల సీజన్లలో కుండలకు గిరాకీ ఉంటుంది. అప్పట్లో ఇంటింటా కుండలు తయారు చేసినా అందరికీ చేతినిండా పని దొరికేది. ఇప్పుడు కొద్దిమందే చేస్తున్నా కావాల్సినంత పని దొరకడం లేదు. ప్రభుత్వం ఆధునిక పరికరాలు అందించి మా కుల వృత్తిని ప్రోత్సహించాలి.

– విజయ్, మద్నూర్

ఇంట్లో అందరూ ఆసరా అవ్వాల్సిందే



మట్టి పాత్రల తయారీ ఒక్కరితో అయ్యేది కాదు. చెరువు నుంచి మట్టిని తీసుకువచ్చి ఆరబెట్టాలి. ఆ తరువాత నానబెట్టి అందులో నుంచి రాళ్లు, రప్పలు, పనికిరానివి తొలగించాలి. ఓ రకంగా జల్లెడపట్టడమే.. ఇంట్లో అందరం కలిసి చేస్తేనే ఈ పనులు అవుతాయి. ఇంత కష్టపడినా లాభం ఉండడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కులవృత్తి చేయాల్సి వస్తోంది. ప్రభుత్వాలు ఆదుకోవాలి.

– గంగాధర్, మద్నూర్

సర్కారు సాయం చేయాలి



ముప్పై ఐదేళ్ల నుంచి ఈ పని చేస్తున్నా. ప్రభుత్వం మా వృత్తి పనికి అవసరమైన సాయం అందించాలి. ఊరి చెరువులో మట్టి దొరక్క దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. మట్టి తెచ్చుకునేందుకు, పాత్రల తయారీకి ప్రభుత్వం సాయం అందించాలి. కుండలు చేసుకుని బతికే మాకు చాలా మందికి ఇళ్లు లేవు. రేకుల షెడ్లు వేసుకుని బతుకుతున్నం. ప్రభుత్వం ఇళ్లు ఇవ్వాలి.

– నాగేశ్, మద్నూర్

మామిడి దిగుబడిపై ఆందోళన



నాగిరెడ్డిపేటలో కాతకు నోచుకోని మామిడితోట

- ప్రతికూల వాతావరణంతో రాలిన పూత
- తెగుళ్లతో మరింత నష్టం

నాగిరెడ్డిపేట: ఈ యేడు జిల్లాలో మామిడి దిగుబడి అంతంత మాత్రంగానే వస్తోంది. సీజన్ ప్రారంభంలో మామిడిచెట్లకు పూత అధికంగా వచ్చినప్పటికీ రోజురోజుకు పూత రాలిపోయింది. అనంతరం తెగుళ్ల దాడి చేయడంతో మరింత నష్టం వాటిల్లింది.

జిల్లాలో 1,745 ఎకరాల్లో మామిడితోటలున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దశలవారీగా పూత వచ్చింది. అయితే వచ్చిన పూత సైతం రాలిపోయింది. చెట్లకు ఉన్న కొంతమేర పూత వల్ల కాసిన కాయలు పిందె దశలోనే పసుపురంగులోకి మారి రాలిపోయాయి. దీనికితోడు మామిడి తోటలను ప్రస్తుతం తేనెమంచు పురుగులు, బూడిద తెగులు ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఎన్ని మందులు వాడినా ఫలితం ఉండడం లేదు. దీని ప్రభావం పంట దిగుబడిపై పడి మామిడి రైతులతోపాటు తోటలను కౌలుకు తీసుకున్న వారూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

మందులకు మస్తు ఖర్చవుతోంది



ఊరి చివరన ఉన్న మామిడితోటను రూ. 1.50 లక్షలకు కౌలుకు తీసుకున్నాను. మామిడితోట నిర్వహణకు, చెట్లకు సోకుతున్న తెగుళ్లను నివారించడానికి మరో రూ.లక్ష వరకు ఖర్చయ్యాయి. సరైన కాత లేకపోవడంతో ఈసారి నష్టమే మిగిలేలా ఉంది.

– దాసరి సాయవ్వ, కౌలు రైతు, మాచాపూర్, ఎల్లారెడ్డి మండలం

ఏం లాభం లేదు..



15ఏళ్లుగా మామిడితోటలను కౌలుకు తీసుకుంటున్నాను. ఈసారి గతంలో ఎన్నడూ లేనివిధంగా మామిడిచెట్ల నుంచి పిందెలు రాలిపోయాయి. తోటకు వస్తున్న తెగుళ్లను నివారించడానికి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. ఈసారి లాభం లేదు.

– దాసరి సాయిలు, కౌలు రైతు, మాచాపూర్, ఎల్లారెడ్డి మండలం

నివారణ చర్యలు చేపట్టాలి

మామిడిచెట్లకు పూసిన పూతలో 0.1 శాతం మాత్రమే నిలబడుతుంది. కానీ ఈ యేడు వాతావరణంలో మార్పుల వల్ల మామిడిచెట్లకు దశలవారీగా పూత వచ్చింది. దీంతోపాటు ప్రస్తుతం మామిడిచెట్లను తేనెమంచు పురుగు, బూడిద తెగులు సోకుతున్నాయి. వీటి నివారణకు సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి. రైతులు తమను సంప్రదిస్తే తగిన సలహాలు, సూచనలు ఇస్తాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి, ఎల్లారెడ్డి

రసవత్తరంగా కుస్తీ పోటీలు

హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం గండిమాసానిపేటలో కుస్తీ పోటీలు నిర్వహించారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి 10 తులాల వెండి కడియం వరకు పోటీలు జరిగాయి. ఢిల్లీకి చెందిన భార్యాభర్తలు బల్జిత్ కౌర్, మోనుసింగ్ ఈ పోటీలలో పాల్గొన్నారు. కాగా బల్జిత్‌కౌర్ స్థానిక మల్లయోధుడితో పోటీపడి ఓటమి చవిచూసి నిరాశ చెందారు. పోటీలను చూడడానికి ప్రజలు తరలివచ్చారు.

– ఎల్లారెడ్డిరూరల్



యువకుడితో కుస్తీ పడుతున్న ఢిల్లీకి చెందిన మహిళ బల్జిత్ కౌర్



తలపడుతున్న మల్లయోధులు

'రాజీవ్ యువ వికాసం' పథకానికి సర్వర్ సమస్య

రామారెడ్డి: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు సమీపిస్తుండడంతో ప్రజలు మీసేవ కేంద్రాలకు పరుగులు తీస్తున్నాయి. అయితే సర్వర్ సమస్య వేధిస్తుండడంతో దరఖాస్తు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. రోజంతా మీ సేవ కేంద్రాల వద్ద వేచి ఉంటున్నా పని కావడంలేదు. రెండు రోజులుగా సర్వర్ సమస్య ఉందని మీ సేవ కేంద్రం నిర్వాహకులు పేర్కొంటున్నారు. రామారెడ్డి మీసేవ కేంద్రంలో 200లకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి సోమవారంతో గడువు ముగియనుంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం శివారులో శనివారం వాహనాల తనిఖీ చేసినట్లు ఎస్సై ప్రకాష్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్స్ లేని వాహనాలు సీజ్ చేశారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శంకర్, మదన్‌లాల్, జవినాయక్, హైమత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఈనెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని రక్తదాతల సమూహ ఫౌండర్, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, అధ్యక్షుడు జమీల్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి 20రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉందన్నారు. యువకులు ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కామారెడ్డి రూరల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని డీపీఎం రమేష్‌బాబు సూచించారు. శనివారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మగోని లక్ష్మీరాజాగౌడ్, ఏపీఎం మోయిజ్, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ నర్సింహారెడ్డి, సీసీ స్వరూపరాణి, గ్రామ సంఘం అధ్యక్షురాలు బుక్యా అనూష, శ్రీను నాయక్, గోవింద్‌నాయక్, సోమ్లా, సర్మల్, మాన్‌సింగ్, లక్ష్మణ్, గణేష్, గ్రామ సంఘం కమిటీ సభ్యులు సంగీత, పద్మ, మంజుల, సోజ్జి తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తెస్తే ప్రయోజనం

- నిర్వహణ లోపంతో వృథాగా మారిన గోలిలింగాల తాగునీటి పథకం
- కోట్ల రూపాయలు వెచ్చించి మంజీరతీరాన ఏర్పాటు
- వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎంతో మేలు



మంజీరనది తీరాన నిర్మించిన ఇంటెక్‌వెల్



తాగునీటి పథకానికి కరెంట్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోలిలింగాల గ్రామశివారులో గల మంజీరనది ఒడ్డున 2010లో అప్పటి ప్రభుత్వ హయాంలో రూ.9 కోట్లతో మంజీర తాగునీటి పథకం పనులను ప్రారంభించారు. పనులు కొనసాగుతున్న తరుణంలోనే అంచనా వ్యయం పెరగడంతో ప్రభుత్వం మరో రూ.4.60కోట్లు మంజూరు చేసింది. 2014లో ఎట్టకేలకు తాగునీటి పథకం పనులు పూర్తయ్యాయి. తాగునీటి పథకం పనులు పూర్తయి తర్వాత కేవలం ట్రయల్‌రన్ మాత్రమే చేశారు. తదనంతర పరిస్థితులతో పథకం వినియోగంలోకి రాకపోగా గత కొన్నేళ్లుగా వృథాగా మిగిలిపోయింది. నాగిరెడ్డిపేట మండలంలోని 30గ్రామాలతో పాటు లింగంపేట మండలంలోని 9గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈతాగునీటి పథకాన్ని నెలకొల్పారు.



ప్రతిపాదనలకే పరిమితమైన మరమ్మతులు

ఈతాగునీటి పథకం మరమ్మతుల కోసం 2019లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.18లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అప్పటి నుంచి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. ఫలితంగా కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన తాగునీటి పథకం వృథాగా మిగిలిపోయింది. నదిలోని ఓపెన్‌వెల్ నుంచి ఇంటెక్‌వెల్ వరకు పైపులైన్‌ను సరిచేయడంతోపాటు ఇంటెక్‌వెల్‌లోని పంప్‌సెట్‌లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తే కనీసం వేసవికాలంలోనైనా మండలప్రజలకు తాగునీటి సరఫరాలో ప్రయోజనం చేకూరనుంది.

ధ్వంసమైన పైపులైన్లు...

గోలిలింగాల గ్రామశివారులో గల మంజీరనదిలో ఓపెన్‌వెల్‌తోపాటు నది ఒడ్డున ఇంటెక్‌వెల్‌ను నిర్మించారు. అక్కడి నుంచి మండలంలోని మాల్తుమ్మెదగేట్ వద్ద గల గుట్ట వరకు పైపులైన వేసి గుట్టపై ఓవర్ హెడ్ రిజర్వ్(ఓహెచ్ఆర్)ట్యాంకును నిర్మింపజేశారు. ఓహెచ్ఆర్ ట్యాంకు నుంచి మండలంలోని 30గ్రామాలతో పాటు లింగంపేట మండలంలోని 9గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా ప్రత్యేకంగా పైపులైన్లను వేశారు. దీంతోపాటు మంజీరనది ఒడ్డున నిర్మించిన ఇంటెక్‌వెల్ నుంచి ఓహెచ్ఆర్ ట్యాంకుకు నీటిని ఎత్తిపోసేందుకు రెండు 40హెచ్‌పీ మోటార్లను సైతం ఏర్పాటు చేశారు. తాగునీటి పథకం వినియోగానికి అవసరమైన కరెంట్ సరఫరా కోసం ఇంటెక్‌వెల్ వద్ద ప్రత్యేకంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లను సైతం ఏర్పాటు చేశారు.మండలంలోని మాల్తుమ్మెద గేట్ నుంచి లింగంపేట మండలంలోని మెంగారం వరకు చేపట్టిన రోడ్డు పనుల్లో భాగంగా ఓహెచ్ఆర్ ట్యాంకు నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్లు ధ్వంసమయ్యాయి. ఏళ్ల తరబడి తాగునీటి పథకాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఇంటెక్‌వెల్‌లోని మోటార్లు సైతం చెడిపోయాయి.



ఇంటెక్‌వెల్‌ను ఒకవైపు పూర్తిగా కప్పేసిన ముళ్లపొదలు

● ప్రమాదకరంగా గుంత

అటెన్షన్ ప్లీజ్

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని అంకోల్ గ్రామంలో ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా ఉంది.డ్రెయినేజీ నీరు వెళ్లేందుకు నిర్మించిన కల్వర్టు యొక్క ఇనుప చువ్వలు పైకి లేచి ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టులో చెత్త నిండిపోవడంతో గుంతలు తీసి శుభ్రం చేశారు. గుంతలను అలాగే వదిలేశారు. కల్వర్టు సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. సెంటర్‌కు వచ్చే చిన్నారులు గుంతలో పడే ప్రమాదం ఉంది. ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అంకోల్ గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న గుంత

ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందించడానికి కృషి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- స్వచ్ఛంద సేవ బృందంతో బిచ్కుంద ఆస్పత్రి సందర్శన

నిజాంసాగర్/బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల నియామకం, మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూర్ సీఎంసీ ఆస్పత్రి పెడియాట్రిక్ డాక్టర్ వినోద్‌షా స్వచ్ఛంద సేవా బృందంతో కలిసి ఎమ్మెల్యే శనివారం బిచ్కుంద ఆస్పత్రి సందర్శించారు. ప్రతి రోజు ఎంత మంది డయాలసిస్ రోగులు వస్తున్నారని, ఇతర వివరాలను సూపరింటెండెట్ కాళిదాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ఆస్పత్రులకు డాక్టర్ వినోద్ షా బృందం సందర్శించనున్నారు. ఈస్వచ్ఛంద సేవ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించనున్నారని అన్నారు. బిచ్కుంద 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిందని, త్వరలోనే స్థలం గుర్తించి పనులు ప్రారంభిస్తామన్నారు. జుక్కల్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బృందంతో కలిసి స్థానిక వైద్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆస్పత్రులు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పోస్టుల భర్తీ, వైద్య సేవల తీరుతెన్నులను తెలుసుకున్నారు. ఆస్పత్రులు ఉన్నా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. సంగారెడ్డి– నాందేడ్ జాతీయ రహదారి ఉన్నా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసరమైన వైద్యం లేక సంగారెడ్డి, నిజామాబాద్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని వైద్య బృందం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పరంగా ప్రైవైట్ పరంగా ఆస్పత్రుల బలోపేతం, మెరుగైన వైద్యసేవలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, దర్పల్ గంగాధర్, సాయిని అశోక్, యోగేష్, డాక్టర్లు కాళిదాస్, రాకేష్, స్వప్నాలి ఉన్నారు.



జుక్కల్‌లో వైద్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మహిళలే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాతలు



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మనోజ



మనోజను సత్కరిస్తున్న తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరి, ఉమెన్ సెల్ డైరెక్టర్ భ్రమరాంబిక

- పాలమూరు వర్సిటీ ప్రొఫెసర్ మనోజ

తెయూ(డిచ్‌పల్లి): మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పాలమూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మనోజ పేర్కొన్నారు. మహనీయుల జయంతి వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ వర్సిటీ ఉమెన్ సెల్ డైరెక్టర్ భ్రమరాంబిక అధ్యక్షతన 'స్త్రీల హక్కులు– లింగ న్యాయం' అనే అంశంపై శనివారం కార్యశాల నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన ప్రొఫెసర్ మనోజ మాట్లాడుతూ.. మహిళల హక్కులు, రక్షణ చట్టాలు, హిందూ వివాహ వ్యవస్థపై అంబేడ్కర్ చేసిన కృషితోనే దేశంలో మహిళల పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. కుటుంబ వ్యవస్థలో సమానమైన ఆస్తి మహిళలకు లభించాలన్న హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా, బిల్లు వీగిపోవడంతో నిరసనగా అంబేడ్కర్ తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పురుషులతో సమానంగా స్త్రీలకు వేతనాలు చెల్లించే చట్టాలు, స్త్రీలను గౌరవించి ప్రసూతి సెలవులను ఇప్పించే చట్టాలను చేయడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. యువత పెడధోరణులు పడుతున్న నేపథ్యంలో వర్తమాన సమాజంలో స్త్రీల హక్కులు, లింగ న్యాయం అనే అంశం చర్చించడం అత్యవసరమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరి రావు పేర్కొన్నారు. వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచనలను అధ్యయనం చేయాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ మనోజను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల, రిసోర్స్ పర్సన్ స్రవంతి, కామర్స్ డీన్ ప్రొఫెసర్ రాంబాబు, సీవోఈ ప్రొఫెసర్ సంపత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

23 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ (ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్) 6, 8, 10వ సెమిస్టర్ థియరీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందికి సన్మానం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పేట్‌సంగెం గ్రామస్తులు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందిని శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. సర్వాపూర్ సెక్షన్ పరిధిలోని పేట్‌సంగెంలో గత నెల 8న పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ లైన్లు, స్తంభాలను సరిచేశారు. అవసరం ఉన్న చోట నూతన స్తంభాలను అమర్చారు. కిందికి వేలాడుతున్న తీగలను సరి చేశారు. దీంతో ట్రాన్స్‌కో సేవలను గుర్తించిన గ్రామస్తులు శనివారం ఎల్లారెడ్డి డీఈ విజయ సారథి, ఏడీఈ చీకోటి మల్లేష్, సర్వాపూర్ ఏఈ లక్ష్మయ్య, లైన్‌మెన్లు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి, సహాయ లైన్ మెన్లు కుమార్, సంతోష్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కత్తూరి శ్రీను, భాను గౌడ్, మాణిక్ రావు, రామాగౌడ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాంచందర్ (50) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. నిజామాబాద్‌లో నివాసం ఉంటున్న రాంచందర్ నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికాగా చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతున్న రాంచందర్‌కు శనివారం గుండెపోటు రావడంతో మరణించాడు. మూడేళ్లుగా జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. రాంచందర్ స్వస్థలం కామారెడ్డి జిల్లా, ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ తండా. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రాంచందర్ మృతి పట్ల జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, ఏఎస్సైలు వెంకట్‌కుమార్, సుశీల్‌కుమార్, సిబ్బంది వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

క్రైం కార్నర్

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్



ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పరిధి లతీఫ్ కాలనీకి చెందిన ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకుడు షేక్ ఆసిఫ్ అలీని పోలీసులు పట్టుకున్నారు. సీఐ సురేశ్‌కుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. అర్సపల్లి బైపాస్ రోడ్డులోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఆసిఫ్ అలీని పట్టుకోగా, అప్పటికే నిందితుడు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, కొంత మంది యువకులకు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపి వారితో క్రికెట్ బెట్టింగ్ ఆడించేవాడినని ఒప్పుకున్నట్లు తెలిపారు. ఆసిఫ్ అలీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై వెంకట్రావు, సిబ్బంది ఉన్నారు.

కార్లను ఢీ కొట్టిన ఆటో డ్రైవర్

భిక్కనూరు: మద్యం మత్తులో ఇంటి ముందు నిలిపిన కార్లను శనివారం ఓ ఆటో డ్రైవర్ ఢీ కొట్టినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. భిక్కనూరులో జరుగుతున్న పెద్దమ్మ ఉత్సవాలకు గ్రామానికి చెందిన పున్న లక్ష్మీనారాయణ బంధువులు వచ్చారు. వారికి చెందిన రెండు కార్లను ఇంటి ఎదుట నిలిపి ఉంచగా, మండల కేంద్రానికి చెందిన బాబు అనే ఆటో డ్రైవర్ మద్యం సేవించి అజాగ్రత్తగా ఆటో నడిపి కార్లను ఢీకొట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఒకరిపై ఇసుక మాఫియా దాడి

రెంజల్(బోధన్): మండలంలోని పేపర్‌మిల్ గ్రామంలో ఇసుక మాఫియా ఓ వ్యక్తిని తీవ్రంగా చితకబాదింది. ఈ నెల 3న నిజామాబాద్ రూరల్ పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెంజల్ మండలానికి చెందిన మూడు టిప్పర్లను పట్టుకున్నారు. టిప్పర్లు పట్టుబడేందుకు గ్రామానికి చెందిన వ్యక్తి కారణమని అనుమానించిన మాఫియా శనివారం అతన్ని పట్టుకొని దాడిచేశారని గ్రామస్తుల ద్వారా తెలిసింది. కొందరు పోలీసులు ఉప్పందించడంతో దాడి జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై చంద్రమోహన్‌ను వివరణగా కోరగా పరస్పరం దాడి చేసుకొని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలికకు చిత్రహింసలు

- తండ్రి, సవతి తల్లిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: రెండో భార్యతో కలిసి కన్న కూతురిని చిత్రహింసలకు గురిచేసిన ఘటన నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ కేసులో తండ్రితోపాటు సవతి తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నాగారం గోశాలకు చెందిన షేక్ హుస్సేన్ మొదటి భార్య అహ్మదీ బేగం నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ఒక కుమార్తె(13) ఉంది. రిజ్వానా బేగంను హుస్సేన్ రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. రెండో వివాహం అయినప్పటి నుంచి బాలికను బడి మాన్పించి, ఇంటి పనులు చేయిస్తూ నరకం చూపిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకే నిద్రలేపి ఇంటి పని చేయించేవారు. పాచిపోయిన అన్నం పెడుతూ కొట్టేవారు. బంధువుల ఇంటికి కూడా వెళ్లనిచ్చేవారు కాదు. ఈ నెల 8న హుస్సేన్, రిజ్వానా బేగంలు బాలికను భైంసాలోని వరసకు అత్తమ్మ అయిన వజీర్‌బీ ఇంటి ఎదుట వదిలేసి వెళ్లిపోయారు. దీంతో వజీర్‌బీ ప్రస్తుతం ఆ బాలికను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. బాలిక మామ షేక్ హయాత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ వెల్లడించారు.

ప్రాణాలు తీసిన చేపల వేట

- ప్రమాదవశాత్తు కుంటలో పడి ఇద్దరి దుర్మరణం
- మృతులిద్దరూ బావాబామ్మర్దులు



షేక్ షాదుల్లా, మహమ్మద్ రఫీక్ మృతదేహాలు

నందిపేట్(ఆర్మూర్): చేపల వేట సరదా ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ప్రమాదవశాత్తు బావాబామ్మర్దులు ఇద్దరు నీట మునిగి చనిపోయిన ఘటన నందిపేట మండలం సిద్దాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన షేక్ షాదుల్లా(46) తన కుటుంబంతో కలిసి 18 ఏళ్ల క్రితం ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి వచ్చి మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కడప జిల్లా పొద్దుటూర్‌కు చెందిన అతని బావమరిది మహమ్మద్ రఫీక్(47) రంజాన్ పండుగ సందర్భంగా వారం క్రితం మచ్చర్లకు వచ్చాడు. కాగా, శుక్రవారం సాయంత్రం సరదాగా చేపలు పట్టేందుకు ఇద్దరూ కలిసి నందిపేట మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులోని చిన్నవాగు సంబంధించిన మునికుంటకు వెళ్లారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు రఫీక్ కాలు జారి కుంటలో పడిపోయాడు. దీంతో అతనిని రక్షించేందుకు షాదుల్లా కుంటలోకి దిగాడు. ఇద్దరికీ ఈత రాకపోవడం, మునికుంటలో లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి మృతి చెందారు. మృతుడు షేక్ షాదుల్లా కొడుకు షేక్ సులేమాన్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

హార్వెస్టర్ ఢీకొని ఒకరి మృతి



గంగాధర్ (ఫైల్)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామంలో శనివారం హార్వెస్టర్ ఢీకొని అరిగెల గంగాధర్ (59) మృతి చెందినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని అరిగెల గంగాధర్ రాజారాం నగర్‌కు చెందిన సోనారి గోవింద్‌తో కలిసి బైక్‌పై గ్రామంలోని హనుమాన్ ఆలయానికి వెళుతున్నారు. మార్గమధ్యలో వీరి ముందు వెళుతున్న హార్వెస్టర్‌ను డ్రైవర్ సింహాద్రి నిర్లక్ష్యంగా వెనక్కి తీయడంతో బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న గోవింద్ పక్కకు దూకగా, వెనుక కూర్చున్న గంగాధర్ హార్వెస్టర్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో డిచ్‌పల్లి 30 పడకల ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు గంగాధర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి ఆవరణలో గంజాయి సాగు

- ఎక్సైజ్ పోలీసుల దాడి
- ఒకరి అరెస్టు.. పరారీలో మరొకరు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): గంజాయి మొక్కలు పెంచుతున్న వారి ఇళ్లపై ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాటేపల్లి తండాలో ఇద్దరు వ్యక్తులు ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు సాగు చేస్తూ అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారంతో సీఐ సత్యనారాయణ బృందంతో కలిసి తనిఖీ చేపట్టారు. భామన్ మధుసింగ్ ఇంటి ఆవరణలో 16 గంజాయి మొక్కలను కనుగొని వాటిని తొలగించి స్వాధీనం చేసుకోగా, నిందితుడు పరారయ్యాడు. మరో వ్యక్తి బర్ధవాల్ రాయిలా ఇంట్లో తనిఖీ చేయగా 200 గ్రాముల ఎండు గంజాయి లభించింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి, బర్ధవాల్ రాయిలాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. గంజాయి మొక్కలు పెంచినా, విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలుడి అదృశ్యం



రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన వాటిల్ గణేశ్ (16) అనే బాలుడు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గణేశ్ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. గురువారం ఉదయం బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు సమీప గ్రామాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి విజయ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య

రుద్రూర్: సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కోటగిరి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి మండల కేంద్రానికి చెందిన బొట్టి లక్ష్మణ్ (20)ను అతిగా ఫోన్ వాడొద్దని తండ్రి బాబయ్య మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మణ్ శ్మశాన వాటికలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోటళ్లలో తనిఖీలు

- పరిశుభ్రత పాటించని ఫుడ్ మేకర్స్‌కు జరిమానా



నిజామాబాద్ సిటీ: నగరంలోని హోటళ్లు, ఆహార పదార్థాలు తయారుచేసే కేంద్రాలపై బల్దియా అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. కంఠేశ్వర్ బైపాస్, ముబారక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు, గదుల శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న మూడు దుకాణాదారులకు రూ.40 వేల జరిమానా విధించినట్లు ఏఎంసీ జయకుమార్ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాదుల్లా, జవాన్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.